సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,25 నవంబర్ 2024


# పెన్షన్‌దారులు సద్వినియోగం చేసుకోండి


**- కొత్త పెన్షన్ల మంజూరుకు అవసరమైన ధృవపత్రాలు చేయించుకోండి**
**- రమణయ్య పేటలో మాజీ ఎంపిటిసి రాయుడు అనిల్ ఇంటింటి ప్రచారం**



**కాకినాడ రూరల్, మేజర్‌న్యూస్ :** నూతనంగా ఎన్డీఏ ప్రభుత్వం కొత్త పెన్షన్లను మంజూరు చేస్తున్న దృష్ట్యా అర్హత ఉన్న ప్రతి ఒక్కరు అప్లికేషన్‌తో పాటు ప్రభుత్వం నియమ నిబంధనలుతో ధృవపత్రాలను సిద్ధం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీటీసీ రాయుడు అనిల్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ వృద్ధాప్య, వికలాంగ, ఒంటరి మహిళలకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అయితే లబ్ధిదారుల అర్హతలకు సంబంధించి ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను ఇవ్వడం జరిగిందన్నారు. వృద్ధాప్యపు పెన్షన్‌కు 60 సంవత్సరాలు నిండి ఉండాలని, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్కు, ఇన్కమ్ సర్టిఫికేట్, క్యాస్ట్ సర్టిఫికెట్, సెల్‌ఫోన్ నెంబరు ఉండాలన్నారు. అదేవిధంగా వితంతు పెన్షన్ మంజూరుకు పైన తెలిపిన సర్టిఫికెట్లతోపాటు వారి భర్త డెత్ సర్టిఫికెట్ తీసుకొని తనకు అప్పజెప్పాల్సిందిగా తెలిపారు. తనకు ఇచ్చిన మంజూరు పత్రాలను నేరుగా ఆన్లైన్ చేయడం జరుగుతుందన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని వారు సంబంధిత సచివాలయులకు వెళ్లి వీలైనంత త్వరగా చేయించుకోవాలని డిసెంబర్ ఒకటో తారీకు లోపల తనకు అందజేయలని స్పష్టం చేశారు.

# నా జీవితం ప్రజాసేవకే అంకితం

**- యువత చేతుల్లోనే భవిత**
**- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్**





**అమలాపురం, మేజర్‌న్యూస్ :** సుభాష్ అనే నేను జీవించి ఉన్నంతవరకు ఏఒక్కరికి కష్టంవచ్చినా అండగా ఉండి ఆదుకుంటానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా నిచ్చారు. ఆదివారం అమలాపురంలోని సత్తెమ్మ తల్లి ఆలయం ఆవరణలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ వనకార్తీకసమారాధన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు రెండు రాష్ట్రాల్లో ఉన్న శెట్టిబలిజలను ఒకే వేదికగా తీసుకొచ్చి వారిలో ఐక్యత నింపే ఉద్దేశంతో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి లక్షలాదిగా తరలి వచ్చిన కుటుంబ సభ్యులను చూసి మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా,రాజకీయ చైతన్యం కలిగిముందుకుసాగాలని పిలుపు నిచ్చారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తరలి వచ్చిన అశేష జన సందోహంతో కోనసీమ జిల్లా కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడితే జాతి సభ్యులు కొండంత అండగా నిలబడి ఓదార్పునిచ్చారన్నారు. అన్యాయంగా కేసుల్లో ఇరికించి బాధల్లో ఉన్న తన పక్షాన నిలబడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. నా ఈ జీవితం ప్రజాసేవకేనని,ఈఅధికారం ప్రజల రుణం తీర్చుకు నేందుకేనని అన్నారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్.ఏ.ఎఫ్.) స్థాపించి, వ్యక్తిగతంగా కోటి రూపాయలు నిధులు విరాళం ఇచ్చామన్నారు. ఆ కోటి రూపాయలు నిధులు కష్టాల్లో ఉన్న జాతి బిడ్డలను ఆదుకునేందుకు ఉపయోగిస్తామన్నారు. దానికోసం పదిమంది టీం సభ్యులను ఏర్పాటు చేసి విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. సాధారణ కార్యకర్త నుంచి ఎమ్మెల్యే,మంత్రిగా నిలబెట్టిన రామచంద్రపురం నియోజవర్గం ప్రజలకు, రాష్ట్ర సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కు మంత్రి సుభాష్ కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని కులాలను కలుపుకుంటా..జాతి,రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తా అంటూ నినదించారు. గత 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కష్టంలో ఎవరున్నా పార్టీపరంగాకాకుండా మానవతా దృక్పథంతో సీఎంసహాయనిధినుండి,వ్యక్తిగతంగా ఆదుకుంటామన్నారు. భర్తను కోల్పోయి పిల్లలతో కష్టాల్లో ఉన్న మహిళలను ఆదుకునేందుకు ఎస్.ఏ.ఎఫ్. ముందు ఉంటుందని,అలాగే వారితో ఎంఎస్ఎంఈ ద్వారా చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసి జీవనోపాధి కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా భారీ రాయితీలు ప్రకటించి సబ్సిడీలు అందిస్తుం దన్నారు. బీసీల అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం 39 వేల కోట్లు కేటాయించిందని అన్నారు. బీసీల సామాజిక భద్రత కోసం బీసీలరక్షణ చట్టానికి ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు.

ఆత్మీయ సమారాధనకు అధ్యక్షత వహించిన మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ జాతి ఐక్యత అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఎవరికి ఏకష్టం వచ్చినా తమ సహాయ, సహకారాలు ఉంటాయని ప్రకటించారు. తొలుత శెట్టిబలిజ జాతి పితామహుడు కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసినివాళులు అర్పించారు. పూజాకార్యక్రమంతో ప్రారంభమైన ఈఆత్మీయ సమ్మేళనం ఆద్యాంతం కోలాహలంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ నాయకులు సంఘనాయకులు ఎమ్మెల్సీ కుడిపూడి సూర్య నారాయణరావు, పెచ్చెట్టి చంద్రమౌళి, సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టి బలిజ సంఘం డైరెక్టర్ డాక్టర్ చప్పిడి. వెంకటేశ్వరరావు,పెచ్చెట్టి విజయలక్ష్మి,గుత్తులసాయి,కట్ట మల్లేశ్వరరావు, చొల్లంగి వేణుగోపాల్,నురుకుర్తి వెంకటేశ్వర్లు, వాసంశెట్టి రాజేశ్వరరావు పెంకె శ్రీనివాస బాబా, వాసంశెట్టి చినబాబు,దొమ్మేటి రాము,మట్టపర్తి నాగేంద్ర, చొల్లగి వెంకటరమణ, వృత్తుల నాగేశ్వరరావు,రొంగల శ్రీధర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## కె.పెదపూడిలో టిడిపి సభ్యత్వ నమోదు



**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రినారాచంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సభ్యత నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలో కె.పెదపూడి,కుడుపూడి వారి పాలెంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోపార్టీ సభ్యత నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుమనాధం హనుమంతురావు,రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఎస్‌సి సెల్ కార్య నిర్వాహన కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ నాయ కులు గుంటూరి మురళి కృష్ణంరాజు, పెచ్చెట్టి శివ సత్య హరిబాబు, మంద రాజేష్, చిక్కం పల్లంరాజు,ఉందుర్తి పరంజ్యోతి, మోకా శ్రీనివాసరావు, పితాని నాగరాజు, పృథ్వి శ్రీనివాస్, నేదునూరి ఏడు కొండలు, తెలుగుదేశంపార్టీనాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## అనుభవజ్ఞులైన వైద్యులతో అన్ని రకాల వైద్య సేవలు

**- స్టార్ డాక్టర్స్ మల్టీ స్పెషలిటి పాలి క్లినిక్ నందు**



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్టార్ డాక్టర్స్ మల్టీ స్పెషాలిటీ పాలి క్లినిక్ నందు అనుభవజ్ఞులైన డాక్టర్లచే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని దీనిని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని స్టార్ డాక్టర్స్ మల్టీ స్పెషాలిటీ పాలి క్లినిక్ డైరెక్టర్ మహమ్మద్ సల్మా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ మల్టీ స్పెషల్ పోలీ క్లినిక్‌కు ప్రముఖ వైద్యులు డా.వై.నాగే శ్వరరావు (ఎముకల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు), డా.టి.సతీష్ చంద్రారెడ్డి, డా.పి.మణికుమార్‌తో పాటుకాకినాడఅపోలో హాస్పటల్ నుండి డా.శివరామగాంధీ(న్యూరో),డా.టి.వెంక టేశ్వరరావు (గుండె వ్యాధులు),డా.సిహెచ్.కరుణాకర్‌రెడ్డి (యూరాలజీ), డా.వంశీ చైతన్య (గ్యాస్ట్రో), డా.వై.ఎస్.వి.ఆర్.కృష్ణ (వాసిక్యూలర్ సర్జన్ మరియు జనరల్ వైద్యులు), డా.పి.శ్రీనివాస్, డా.ఎన్.పావని కిరణ్మయి, డా.ఎన్.సుస్మిత, డా.వి.వి.వి.సత్య నారాయణ (చర్మ వ్యాధినిపుణులు),డా.ఎస్.అఖిల(మానసిక వ్యాధులు), డా.బి.మనోజ్ఞ (పిల్లల వైద్య నిపుణులు), తదితర ప్రముఖ వైద్యులు మల్టీ స్పెషలీటి పాలి క్లినిక్‌లో అందుబాటులో ఉంటారని, 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. అపాయింట్‌మెంట్ కొరకు 8500878333, 8500678333లను సంప్రదించాలని డైరెక్టర్ మహ్మద్ సల్మా బేగం తెలిపారు.

## గౌతమ్ ఆదానిని తక్షణమే అరెస్టు చేయాలి

**- సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన**



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** సోలార్ విద్యుత్ పేరుతో అవినీతికి పాల్పడిన గౌతమ్ ఆదానిని తక్షణం అరెస్టు చేయాలని ఆదాని కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పెద్దాపురం పట్టణంలోమెయిన్‌రోడ్‌లో వినాయకుని గుడి వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక నేరగాడిగా ఆదాని మారిపోయాడని, అమెరికాలో ఆదాని మీద, అతని కంపెనీలకు సంబంధించిన 7గురు మీద అరెస్టు వారెంట్ విడుదల చేశారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. స్మార్ట్‌మీటర్‌లను ఆదాని కంపెనీ సరఫరా చేస్తుందని, తక్షణం ఈఒప్పందం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరపురపు శ్రీనివాస్, కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహామూర్తి, డి.కృష్ణ, ఆర్.వీర్రాజు, సుబ్బలక్ష్మీ, మరిడయ్య, అరుణ్, అమృత, తాడిశెట్టి గంగ, శ్రీనివాస్, మణికంఠ, బుడతా రవీంద్ర, జగదీష్, కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులలో 1200 లీ.బెల్లపు ఊట ధ్వంసం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆదేశాల మేరకు ఆదివారం పెద్దాపురం సర్కిల్ పరిధిలోని పెద్దాపురం మండలంలోని జి.రాగంపేట గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 1200 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు పి.చిట్టిబాబులు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్‌పి కార్యాలయంలో దర్యాప్తు సహాయ శిక్షణ



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో కాకినాడ జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలో గల స్టేషన్‌లలోని రైటర్స్, క్రైమ్ సిబ్బందికి దర్యాప్తులో భాగంగా గ్రామస్థాయిలో చిన్న చిన్న విచారణలు చేయడం,వాంగ్మూలం నమోదుపరచడం, రికార్డుల నిర్వహణ చేస్తూ దర్యాప్తు అధికారికి శాస్త్రీయంగా సహాయం చేయడం వంటి శిక్షణా కార్యక్రమం ఆదివారం డిఎస్‌పి డి.శ్రీహరి రాజు నిర్వహించారు. ఈ శిక్షణలో 12 పోలీస్ స్టేషన్‌ల నుండి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాసిన ప్రణీతకు లయన్స్ క్లబ్ సభ్యులచే స్కాలర్షిప్



**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** పుల్లేటికుర్రులో లయన్స్ క్లబ్ అమలాపురం వశిష్ట ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. సర్వీస్ యాక్టివిటీస్‌లో భాగంగా ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థి కాసిన ప్రణీతకి రూ.15000లు స్కాలర్షిప్‌ను గవర్నర్ చేతులమీదుగా అందచేసారు. అలాగే లయన్స్ క్లబ్ అమలాపురం వశిష్ట వారిచే వ్యాఘ్రేశ్వర స్వామి ఆలయము నందు కౌశికా జలధార పేరుతో జల్లు స్నానం పర్మినెంట్ ప్రాజెక్టు నిర్మించారు. కార్తీక మాసములో భక్తులకు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ని 316 బి జిల్లా గవర్నర్ లయన్ ఈ.వి.వి.ఈశ్వర్ కుమార్, పిఎంజెఎఫ్, సర్పంచ్ జల్లి బాలరాజులు ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలు నుండి అమలాపురం లయన్స్ క్లబ్ వశిష్ట ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్విహించామని, వారి సేవలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడినవి అని తెలియజేశారు. ఈ ప్రాజెక్టుని క్లబ్ చార్టర్ మెంబర్ లయన్ పి.సుబ్బలక్ష్మి స్మృతి చిహ్నంగా వారి సోదరి లయన్స్ క్లబ్ వశిష్ట ప్రెసిడెంట్ కె.ఉషాబాల ఆర్థిక సహాయంతో నిర్మించడం జరిగిందన్నారు. ఆమె గతంలో ఈ వశిష్ట క్లబ్ ప్రెసిడెంట్‌గా చేసిన సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయటమేకాక తన సొంత ఖర్చులతో అనేకమందికి ఆర్థికంగానూ సామాజికం గాను సేవలు, విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందించి ఎంతోమంది ఉన్నత చదువులు చదువులు చదువుకున్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు తన సేవలను అందించిన లయన్ బెహరా హనుమంతరావు, సర్పంచ్ బాలరాజు, లయన్ గవర్నర్ ఈశ్వరకుమార్ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమానికి లైన్స్ క్లబ్ వశిష్ట ప్రెసిడెంట్ లయన్ కె.ఉషాబాల, సెక్రటరీ లయన్ చిక్కాల అరుణ, లయన్ పప్పు కామేశ్వరి దేవి, లయన్ కుడుపూడి ఉమాదేవి, లయన్ కల్వకులను ఛాయాదేవి, లయన్ దిట్టకవి అమ్మాజీ, అమలాపురం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ రవణం వేణుగోపాలరావు, ఉప సర్పంచ్ వీరా రవి, సామాజిక కార్యకర్త లక్కింశెట్టి భాస్కరరావు, అయ్యగారి వెంకటరావు, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, లయన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా పి.డి.ఎస్.యు 50 వసంతాల స్వర్ణోత్సవాలు

**- డిసెంబర్ 5న జరుగు ఉమ్మడి జిల్లా సభను జయప్రదం చేయండి**
**- పిడిఎస్‌యు రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్**



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** విప్లవోద్యమాల వేగుచుక్క ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) 50 వసంతాల మేఘ గర్జన పోరాట స్ఫూర్తి సభ పోస్టర్స్ లను రామచంద్రపురం స్థానిక ఆల్ ఏపీ గవర్నమెంట్ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హాల్లో పి.డి.ఎస్.యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, పీడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్ అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భీమశంకరం,పి.వై.ఎల్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.చిట్టిబాబు తదితరులు పి.డి.ఎస్.యు. 50 సంవత్సరాల చరిత్ర పుస్తకం మరియు పాటలు లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శి బి.సిద్దు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా విముక్తి పోరాటాల ప్రభావంతో ఉస్మానియాలో పురుడు పోసుకున్న పిడిఎస్‌యు (1974 అక్టోబర్ 12 నాటికి) 50 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ విద్యార్థి లోకానికి పిలుపు నిచ్చారు. 60దశకంలో గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు,శ్రీకాకుళ,నక్సల్ బరి పోరాటాల ప్రేరణతో ప్రగతిశీల విద్యార్థులు నూతన సమాజ స్థాపన కోసం విద్యార్థులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. ఉస్మానియా అరుణ తార కామ్రేడ్ జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ తోపాటు అనేకమంది విద్యార్థి రత్నాలు తమ విలువైన ప్రాణాలను ప్రజల కోసం అర్పించారు. వారు అందించిన ఉద్యమాల స్ఫూర్తితో నేటికీ ప్రగతిశీల విద్యార్థులు సమ సమాజ స్థాపన కోసం కృషి సాగిస్తున్నారు. భారతదేశంలో బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన మెకాలే విద్యా విధానమే నేటికీ కొనసాగుతుంది అని మోడీ ప్రకటించి అశాస్త్రీయమైన, హేతుబద్ధత లేని పుక్కిటి పురాణాలతో నిండి వున్న నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చారు. తార్కిక జ్ఞానాన్ని పెంపొందించవలసిన విశ్వవిద్యాలయాలు చిలక జ్యోతిష్యం, వాస్తు శాస్త్రాలు సిలబస్‌గా తీసుకొచ్చి విశ్వవిద్యాలయాలను మారుస్తున్నారని అన్నారు. సమసమాజ స్థాపన, దోపిడీ లేని సమాజం, అందరికీ విద్యా, అందరికీ ఉపాధి, శాస్త్రీయ విద్య లక్ష్యంగా, అందరికీ అందుబాటులో ఉండే విద్య కొరకు ఏర్పడిన పిడిఎస్‌యు తమ లక్ష్యానికి అనుగుణంగా రాజీలేని పోరాటాలను నిర్వహిస్తుంది. ఈక్రమంలో డిసెంబర్ 5న విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తి సభను జయప్రదం చేయాలని విద్యార్థులు యువకులు, మేధావులు, విద్యార్థి సంస్థల యాజమాన్యాలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, టీచర్స్‌కు, ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాజారెడ్డి వీర, వెంకట్, చైతన్య తదితరులు పాల్గొన్నారు

## కళ్యాణ్ కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవాకార్యక్రమాలు




**కాకినాడ,మేజర్‌న్యూస్ :** మాజీ మంత్రి కురసాల కన్నబాబు సోదరుడు ప్రముఖ సినీ దర్శకుడు కురసాల కళ్యాణ్‌కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని కురసాల కళ్యాణ్ కృష్ణబాబు యూత్ ఆధ్వర్యంలో నడుకుదురు, తూరంగి వృద్ధాశ్రమాలలో, ఇందిరాకాలనీ తదితర చోట్ల వృద్ధులకు చీరలు, పళ్ళు, బిస్కెట్ ప్యాకెట్లు పంచి, రోడ్ మీద నిరాశ్రయులకు దుప్పట్లు పంచి ఘనంగా జన్మదిన వేడుకలు జరిపించడం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఇందిరాకాలనీవాసులు మాట్లాడుతూ మాకు ఎప్పుడు ఏకష్టం వచ్చినా మేమున్నామని మాకు అండగా నిలబడే వ్యక్తులు కురసాల కన్నబాబు, కళ్యాణ్ కృష్ణ అని, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం అందరికీ చీరలు,పళ్ళుపంచి మా సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం మాకు చాలా ఆనందంగా ఉందని, ఆయనకు ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన తీయబోయే ప్రతీ చిత్రమూ ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కురసాల కళ్యాణ్ కృష్ణబాబు యూత్ సభ్యులు కర్రి చక్రధర్, ధోని శ్రీనివాస్, మోకా కృష్ణంరాజు, ముద్రగడ నాయుడు, సిద్ధా శివాజీ, గొడతా సూర్యప్రకాష్, తర్లపు మణికంఠ, పవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం- పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆదివారం అన్నప్రసాద వితరణ దాత అనకాపల్లి వాస్తవ్యులు మడపల శ్రీనివాస్, పద్మజ దంపతులు వారి సహకారంతో నిర్వహించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## యధావిధిగా నవంబర్ 25 సోమవారం "పీజీఆర్‌ఎస్ 'మీ కోసం"

**- జిల్లా కలెక్టర్ ప్రశాంతి**



**రాజమహేంద్రవరం,మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ నవంబర్ 25వ తేదీన చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. నవంబర్ 25 వ తేదీ సోమవారం పిజిఆర్ఎస్ - మీ కోసం ద్వారా ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, రెవెన్యు డివిజనల్ , మునిసిపల్, మండల స్థాయిలో "మీకోసం"కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కావున జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని,మీమీ అర్జీలని క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండే డివిజనల్, మునిసిపల్, మండల స్థాయి అధికారులకి అందచేయాలని కోరారు. ఆర్జిదారులు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కలెక్టరేట్ వద్దకు రావద్దని కలెక్టరు ప్రశాంతి తెలియచేశారు. రెవిన్యూ డివిజనల్ అధికారులకి, మునిసిపల్ కమిషనర్లకు, తహసిల్దార్, ఎంపిడివో ఇతర మండల స్థాయి అధికారులకి అందచేయాలని తెలియ చేశారు.

### రాజవొమ్మంగి నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణములో కార్తీక వన సమారాధన



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : రాజవొమ్మంగి శ్రీ శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భారీ అన్న సమాధానం కార్యక్రమం జరిగింది. స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, పెద్ది రాజుల నేతృత్వంలోఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల నలుమూలాల నుండి సుమారు 4000 మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. భవన్ నిర్మాణ కార్మికులు, స్థానిక యువకులు, అన్ని పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొని సేవలు అందించారు.

### ఉచిత హోమియో ఆసుపత్రిని ప్రారంభించిన జి.వి.రావు



రామచంద్రపురం, మేజర్ న్యూస్ : పట్టణంలో చేకూరి పాపారావు,శ్రీమతి కాంతకుమారి ఆధ్వర్యంలో శిరిడి సాయి హోమియో ఆసుపత్రి ఆదివారం ప్రారంభించారు. స్థానిక తిలక్ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో హోమియో ఆసుపత్రిని ప్రముఖ విద్యావేత్త, మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ సమాజ సేవ చేయాలనే ఆకాంక్షతో పాపారావు దంపతులు ఉచిత హోమియో ఆస్పత్రి ప్రారంభించడం స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ వి.పి.ఎల్.లక్ష్మి, డాక్టర్ సి.హెచ్. శ్రీనివాసరావు ప్రజలకు వైద్య సలహాలు అందజేసి హోమియో వైద్యం అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ చేకూరి పాపారావు మాట్లాడుతూ ఉచిత హోమియో ఆసుపత్రికి విశేష స్పందన వచ్చిందని పేర్కొన్నారు. 72 మంది పేషెంట్స్ ఆసుపత్రికి వచ్చారని, వారికి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంపౌండర్ జయ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త మహా ధర్నాను విజయవంతం చేయాలి

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** దేశవ్యాప్త మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఏజెన్సీ గిరిజన సంఘం, ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం కార్యకర్తలు ఆదివారం రంపచోడవరం వారపు సంతలో ప్రచారం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చ ఇచ్చిన అఖిల భారత పిలుపులో భాగంగా ఏపీ రైతు, వ్యవసాయ, కార్మిక, గిరిజన, వృత్తి, సామాజిక సంఘాల సమన్వయ సమితి ఏపీయస్‌కేయం, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ల అనుబంధ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీల ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన జరిగే దేశవ్యాప్త మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆంధ్ర ప్రదేశ్ కార్యకర్తలు రంపచోడవరం సంతలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ఆంధ్ర ప్రదేశ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ వంజం జోగారావు, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వేట్ల బాబూరావు,




పోడియం రామరాజు, కొవ్వాసి చిట్టాబ్బాయి, చోడే రామిసెట్టి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి సీ టు ప్లస్ 50 చట్టబద్ధత యంయస్‌పి ప్రకటించాలని, పోలవరం ప్రాజెక్టు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వారికి పునరావాసం పరిహారం కల్పించాలని, ప్రభుత కనీస వేతనం రూ.26 వేలు రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ రైల్వే ఉద్యోగాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి రోజు వేతనం 600 రూపాయలకు పెంచాలని, అటవీ హక్కుల పరిరక్షణ చట్టం 2023 ఉపసంహరించాలని కోరారు. ఆదివాసీలు, అటవీ నివాసుల హక్కులను పరిక్షించాలని, అటవీ హక్కుల పరిరక్షణ సవరణ చట్టం 2023ను వెంటనే నిలిపివేయాలని తదితర డిమాండ్లతో 26వ తేదీన రంపచోడవరంలో జరుగుతున్న మహాధర్నాను విజయవంతం చేయాలని వారు ప్రజల్ని కోరారు.

### పోలింగ్ బూత్‌ను పరిశీలించిన అదనపు సిఇఓ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలంలోని వడ్లమూరు గ్రామంలో స్పెషల్ సమరీ రివిజన్ 2025లో భాగంగా స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమం సందర్భంగా పోలింగ్ బూత్‌ను అసిస్టెంట్ సిఇఓ ఎస్.ఆంజనేయులు పరిశీలించి, బూత్ లెవెల్ అధికారులకు ఓటు నమోదుపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 సం.లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదుకు అర్హులని, పోలింగ్ స్టేషన్‌ల వద్ద బిఎల్‌ఓలు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండి, ధరఖాస్తులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. ఆయన వెంట పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ కళావతి, వీఆర్వో తదితరులు ఉన్నారు.

## వైభవంగా బిల్వార్చన పూజ



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** స్థానిక బాల త్రిపుర సుందరి సమేత ఆగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం వైభవంగా బిల్వార్చన పూజ నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు ఇంద్ర గంటి విశ్వనాథ శర్మ బ్రహ్మత్వంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ,లక్ష కుంకుమార్చన భక్తి ప్రభృతులతో చేశారు. సాయంత్రం స్వామివారికి అమ్మవారికి ధూప సేవ, పల్లకి సేవ, నిరాజన మంత్రపుష్పం వైభవోపేతంగా జరిపారు. 30 మంది బ్రాహ్మణ దంపతులు, 23వ వార్డు కౌన్సిలర్ సాయిప్రసాద్ వాడ్రేవు విశేషమైన ఈ క్రతువులో పాల్గొన్నారు. వేద పండితులు పైడిమర్రి సుబ్రహ్మణ్యం, చీమల కొండ వినోద్, పెండ్యాల మురళి తదితరులు ఈ పూజలో పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల మధ్య ఆనందంగా సాగిన కాపు వన సమారాదన







**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రతి సంవత్సరం కాపు సద్భావన సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసు అధ్యక్షతన కార్తీక మాసంలో జరిగే కాపు వన సమారాదన కార్యక్రమం ఆదివారం ఎన్‌ఎఫ్‌సిఎల్ రోడ్డులో గల శుభం కాపు కళ్యాణ మండపం ప్రాంగణంలో అత్యంత ఆనందోత్సాహల మధ్య ఉత్సాహం జరిగింది ఈ కార్యక్రమానికి కాపు సామాజిక వర్గానికి చెందినవారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాపు సామాజిక కుటుంబ సభ్యులతో కలిసి ఈ వన సమారాదనలో పాల్గొని కార్తీక వనభోజనం కుటుంబ సమేతంగా ఆరగించి ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా అనేక రకాల ఆట పాటలతో ఆనందం గా గడిపారు. భోజన సమయంలో నాయకులు తాము ఈ స్థాయికి రావడానికి కారణం ప్రదానంగా తాము పుట్టిన కాపు కులం అని చెప్పడానికి గర్వపడుతున్నామని, అలాగే కాపు కులానికి చెందిన ప్రతి ఒక్కరూ ఇతర కులాల వారిని అక్కున చేర్చుకోని తాము ఎదుగుతు ఇతర కులాలవారికి చేయూత అందించాలని సూచించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ఎవరికి ఏ కష్టం వచ్చినా తోట త్రిమూర్తులు ఉన్నాడని తెలిపారు, కౌడా చైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ కాపులందరూ ఐక్యతతో ఉండాలన్నారు. కాపుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ వన సమారాధనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాపు సామాజిక కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసారు.

### శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా అజ్ఞాత్మిక పీఠం వద్ద నేడు భారీ అన్న సమారాధన



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : రాజవొమ్మంగి శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆజ్ఞాత్మిక పీఠం ప్రాంగణం లో సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీఠ పర్యవేక్షకులు రిటైర్డ్ మాస్టర్ మరిషే నాగేశ్వరరావు తెలిపారు. కార్తీక మాసాన్ని పరిష్కరించుకొని పిఠాపురం శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆజ్ఞాత్మిక పీఠం డాక్టర్ ఉమర్ అలీషా అధ్వర్యంలో రాజవొమ్మంగి శాఖ భారీ స్థాయిలో ఈ వన భోజనకార్యక్రమం చేపడుతున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. భక్తులు యావన్మాంది సోమవారం ఉదయం నుండిపాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాల్సిందిగా ఆయన కోరారు.

### పోలింగ్ స్టేషన్ తనిఖీ చేసిన ఆర్డీఓ శ్రీరమణి



పెద్దాపురం,మేజర్‌న్యూస్ : స్పెషల్ సమరీ రివిజన్ 2025 ప్రత్యేక ప్రచారం సందర్భంగా ఈఆర్వో మరియు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదివారం పెద్దాపురం పురపాలక సంఘంలోని పోలింగ్ స్టేషన్ 80,81,53,54లను ఆమె తనిఖీ చేశారు.దీనిలో భాగంగా 18-19సంవత్సరాల వయసుగల వారి ధరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ధరఖాస్తుదారులకు మార్గనిర్దేశనం చేయడం మరియు సందేహాల నివృత్తి చేయడం వంటి అంశాలపై బిఎల్‌ఓలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.అలాగే యువ ఓటర్ల నమోదు పెంచేందుకు ప్రత్యేక ప్రచార రోజులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఓలు గంగాధరరావు, వీర్రాజు, తదితరులు ఉన్నారు.

# రాజ్యాంగం-హక్కులు-పరిరక్షణపై అవగాహన సదస్సు

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** 26 నవంబర్ భారత రాజ్యాంగ దినోత్సవము సందర్భముగా మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్, కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాగంపేటలో గల అల్ ఫలా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీలో "భారత రాజ్యాంగము-హక్కులు- పరిరక్షణ" అనే అంశముపై కాకినాడ నగర ప్రముఖులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎండి. హలీమ్ మాట్లాడుతూ డా.బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగము చాలా ఉత్ కృష్టమైనదని, అన్ని మతాలవారు ఆచరించే ధార్మిక గ్రంథాల కంటే కూడా గొప్పదని వివరించారు. అన్ని మతాల వారు శాంతియుత జీవితము గడిపే విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించారని కొనియాడారు. భారత రాజ్యాంగం అమలులో ఉన్నత కాలము ప్రజలందరు సుఖసంతోషాలతో ఉంటారని తెలిపారు. ఎంపీజే రాష్ట్ర సభ్యులు హుస్సేన్ రాజ్యాంగం యొక్క ఆవశ్యకతను వివరించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఇమామ్ మోహియుద్దీన్ ఎంపీజే చేస్తున్న సవాకార్యక్రమాలను వివరించారు. భారత రాజ్యాంగంలో మనకు కల్పించబడిన హక్కులు గూర్చి ఎంపీజే సిటీ సభ్యులు ఆదిత్య డిగ్రీ కాలేజీ ప్రొఫెసర్ డా. ఎస్.ఎ.జి. అన్సార్ అలీ వివరించగ, ముఖ్య అతిథి ప్రముఖ న్యాయవాది సయ్యద్ సాలర్ భారత రాజ్యాంగము అవతరణ దాని అమలు గూర్చి పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం న్యాయవాది సాలార్ ని ఎంపీజే సభ్యులు ఘనంగా సత్కరించారు. చివరగా కాకినాడ జిల్లా అధ్యకులు ఎండి హలీమ్ భారత రాజ్యాంగ ప్రవేశికను సభకు హాజరైన వారందరిచేత ప్రతిజ్ఞ/ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, ఎంపీజే జిల్లా సభ్యులు, సిటీ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్లా వందన సమర్పణ, మరియు జాతీయ గీత ఆలాపనముతో ఈ సమావేశము ముగిసినది.





### ఆత్మీయ ఆసుపత్రిని ప్రారంభించిన ప్రముఖులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** దివంగత మాజీ డిసిసిబి చైర్మన్ శిరంగు కుక్కుటేశ్వరరావు మనవడు, డాక్టర్ శిరంగు దొరబాబు, డాక్టర్ మాధవి ఎన్‌ఎఫ్‌సిఎల్ రోడ్డులో ఆత్మీయ ఆసుపత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రిని ఆదివారం కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ప్రారంభించారు. అనంతరం డాక్టర్లు దొరబాబు, మాధవి మాట్లాడుతూ తాము గతంలో వివిధ నగరాల్లో కార్పోరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించామని ఇప్పుడు తాము పుట్టి పెరిగిన ప్రాంతంలో పేద, మద్యతరగతివారికి అత్యంత అత్యాధునిక వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ ఆత్మీయ ఆసుపత్రి ని ప్రారంభించామని అన్నారు. అలాగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ కేంద్ర మంత్రి మల్లిపూడి మంగపతి పళ్ళంరాజు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ శ్రీ మరిడమ్మ అమ్మవార్కి సారె సమర్పణ



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం పెద్దాపురం పట్టణంలో గల కొత్తబస్టాండ్ వద్ద శ్రీ సిద్ధి వినాయక షిర్డి సాయిబాబా ఆలయం వారు శ్రీ అమ్మవార్కి సారె సమర్పించారు. వార్కి దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తదుపరి దేవస్థానం తరపున అమ్మవారి కుంకుమ, గాజులు, ప్రసాదాలు వార్కి అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయవిజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ భవిష్యత్తు తరాల ఉనికి కోసం పోరాటం




రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఆదివాసీ భవిష్యత్తు తరాల ఉనికి కోసం ఉద్యమ పోరాటాలు తప్పవని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పేర్కొన్నారు. వై.రామవరం మండలం తోటకూరపాలెంలో ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ ఆదివాసీలకు రాజ్యంగ హక్కులు దక్కాలంటే ఉద్యమించక తప్పదని, ఉద్యమిస్తేనే ఆదివాసీలకు ఉనికి ఉంటుందని లేదంటే భవిష్యత్తు ప్రశ్నర్ధకమే అన్నారు. ఆదివాసీ సంఘాలు ఎన్ని ఉద్యమాలు చేసినా ఆదివాసీల్లో ఐక్యత, పోరాట పటిమ ప్రశ్నించేతత్వం లేకుంటే రాజ్యాంగ ఫలాలు అందని ద్రాక్షగానే మిగిలి పోతాయన్నారు. ఆదివాసీ యోధుల స్ఫూర్తి నేటి యువతలో లేకపోవడం వలెనే ఆదివాసీ జీవోలు, చట్టాలు కోల్పోతున్నామని, ముఖ్యంగా ఆదివాసీ ఉద్యమం తీవ్రతరం చేయాల్సిన సమయం అసన్నమైందని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోరాట ఫలితంగానే జీవో 3 వచ్చిందని, కానీ మన నిర్లక్ష్యం పాలకుల అసమర్ధత వలన జీవో 3రద్దు అయిందని పేర్కొన్నారు. అలాగే నేడు నాన్‌ట్రైబల్ ఏజెన్సీ భూములపై హక్కులు అడుగుతున్నారని, ట్రైబల్ బినామీ మాటున వేల ఎకరాలు ఇప్పటికే గిరిజనేతరులు దోచుకున్నారన్నారు. 1/70 చట్టం రద్దు అయితే ఇంకా ఆదివాసీలకు ఏజెన్సీలో నిలువ నీడ ఉండదని, కాబట్టి ఆదివాసీ చట్టాలపై అవగాహన పొంది, ప్రతీ ఆదివాసీ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బచ్చల అమ్ములు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబూరావు, పీట ప్రసాద్, పల్లాల మంగిరెడ్డి, బచ్చల లక్ష్మి కాంతం, వించెల భూదేవి, కడబాల రమేష్ రెడ్డి, రాజారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

### ముగిసిన శిక్షణా కార్యక్రమం



కాకినాడ,మేజర్‌న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) పరిపాలనా భవనంలోని పిజి రీసెర్చ్ ల్యాబ్ నందు రెండు రోజుల పాటు నాన్ టీచింగ్ సిబ్బందికి ఎంఎస్ ఆఫీస్‌పై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం ఆదివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎఫ్‌డిసి డైరెక్టర్ ప్రొ.పి.సుబ్బారావు అధ్యక్షత వహించగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్‌జి.మురళీకృష్ణ గారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మనలో నైపుణ్యాలు ఉండే మనకు ఎవరూ సరిరారన్నారు. నిరంతర అభ్యసన ద్వారా మనలో జ్ఞానం ఎప్పుడూ పెరుగుతూ ఉంటుందని, దాన్ని ఇతరులకు నేర్పినపుడు అది మరింత పెరుగుతుందన్నారు. ఉద్యోగులుగా మీరు నేర్చుకున్న సాంకేతిక అంశాలు వలన విశ్వవిద్యాలయానికి మంచి జరుగుతుందన్నారు. ఎఫ్‌డిసి డైరెక్టర్ ప్రొ.పి.సుబ్బారావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. మనకు ఏదైనా ఒక అంశంపై నూటికి 90శాతం తెలిసినా మిగిలిన 10శాతం తెలుసుకోవాల్సిన అంశాలు ఉంటాయని, కొత్త విషయాలు నేర్చుకునేందుకు ఆసక్తి కనబర్చాలన్నారు. వ్యవస్థ అభివృద్ధి చెందితే మనం కూడా అభివృద్ధి చెందుతామన్నారు. ఎంఎస్ ఆఫీస్‌పై రెండు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో వివిధ సాంకేతికతలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు ఎస్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.జి.కె.కశ్యప్, సిఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రఘురామ్, సిన్‌టాక్స్ ఎన్ కంపెనీ సేల్స్ హెడ్ ఎం.వెంకట్, రీసోర్స్ పర్సన్‌లు షాజహాన్,సాగర్, జి.సంతోష్,ఎం.భార్గవ్,నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

**– జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం నవంబర్ 25న సోమవారం ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ సోమవారం ఉదయం 9.30 గంటలకు ఆయా మండలాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు.

# నీటి సంఘం ఎన్నికల్లో కూటమి కలిసి పని చేయాలి

**– ఇప్పటివరకు పిఠాపురంలో టిడిపికి 15వేల సభ్యత్వ నమోదు**

**– పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ అధ్యక్షతన పార్టీ కార్యాలయం నందు ఆదివారం పిఠాపురం మండలం బూత్, యూనిట్ మరియు క్లస్టర్ ఇంచార్జిలతో మరియు ముఖ్య నాయకులతో పార్టీ సభ్యత్వం మరియు నీటి సంఘం ఎన్నికలు కోసం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తించడం జరుగుతుందని, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గా పిఠాపురం మండలం నుండి బర్ల అప్పారావుని నియమించడం జరిగిందన్నారు. వారిని అభినందించి సాలువతో సత్కరించి, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ తరుపున ధన్యవాదములు తెలిపారు. నేటి వరకూ పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వం నమోదు 15వేలు పూర్తీ చేసారని పేర్కొన్నారు. ఇంకా పెరగాలని చెప్పి అందరికి తెలియజేయడం జరిగిందని, అదే విధంగా నీటి సంఘం ఎన్నికలు జరగనున్న వేళ కూటమి నుండి జనసేన, తెలుగుదేశం కలిసి పోటి చేస్తుందని, రాష్ట్ర పార్టీ ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తున్నామని, కూటమి పార్టీల నుండి ఎవ్వరు ఎక్కడ పోటీ చేసినా... కలిసి పనిచేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ రైతులకు వెన్నంటి ఉంటుందన్నారు.

పవన్ కళ్యాణ్ అధ్యక్షతన ఉప్పాడలో జరిగిన బహిరంగ సభలో పిఠాపురం రైతాంగానికి ఏలేరు ఆధునీకరణ పూర్తీ చేస్తామని మాట ఇవ్వడం జరిగిందని తెలిపారు. రైతులందరు నీటి సంఘం ఎన్నికల్లో కూటమిని బంఫర్ మెజారిటీతో గెలిపిస్తారని, కలిసి పనిచేయాలని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సకుమళ్ళ గంగాధర్ రావు, బర్ల అప్పారావు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.